

## హనుమకొండలో కాకతీయ నృత్య, నాటకోత్సవాలు ప్రారంభం

### ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు పొంగులేటి, జూపల్లి, సురేఖ, సీతక్క

**హనుమకొండ బ్యూరో, సెప్టెంబరు 21:** తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి రెండు రోజులపాటు కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్న కాకతీయ నృత్య నాటకోత్సవాలు ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించగా, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, సీతక్క తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ నాట్య గురు, అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య డాక్టర్ అలేఖ్య పుంజాల ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ కూచిపూడి నృత్య రూపకం, ఓరుగల్లు చరిత్ర కాకతీయ వైభవం గుర్తు చేస్తూ రాణి రుద్రమ చారిత్రక నాటకం, ప్రజా సాహిత్య కళారూపాల ప్రదర్శనలు నిర్వహించారు. డాక్టర్ అలేఖ్య పుంజాల నృత్య దర్శకత్వంలో 30 మంది కళాకారులు చాకలి ఐలమ్మ కూచిపూడి నృత్య రూపకం ప్రదర్శించారు. చాకలి ఐలమ్మ జీవిత చరిత్ర ను కళ్ళ ముందుంచే ఈ నృత్య రూపకాన్ని డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ రచించగా సంగీత దర్శకుడు వి.బి. ఎస్.మురళి సంగీతం సమకూర్చారు. బతుకమ్మ పండుగ సందర్భంగా అలేఖ్య ప్రదర్శనను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాలశాఖ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్కతో పాటు శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ డాక్టర్ బండా ప్రకాష్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద సంబంధిత శాఖల అధికారులు పాల్గొని తిలకించారు. అనంతరం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కళాకారులను ఘనంగా సత్కరించారు. అంతకుముందు హనుమకొండ జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఉమ్మడి ,వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి వర్యులు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రొహిబిషన్ ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గారికి హోటల్ హరిత కాకతీయ నందు స్వాగతం పలికిన వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య,నగర మేయర్ గుండు సుధారాణి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ నగర సిపి సన్ ప్రీత్ సింగ్, సిఎండి వరుణ్ రెడ్డి, జిడబ్ల్యుఎంసి కమిషనర్ చాహత్ వాజ్ పేయి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట రామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ స్టడీ సర్కిళ్లకు నిధులు కేటాయించాలి

### పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వాలి

### ప్రభుత్వానికి డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 ఎస్సి స్టడీ సర్కిల్స్ 9 నెలలుగా నిధుల కొరతతో ఎటువంటి కోచింగ్ నడపటం లేదని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డివైఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటి ఆవేదన వ్యక్తం చేసింది. వెంటనే రాష్ట్రంలోని ఎస్సి స్టడి సర్కిల్స్ కి నిధులు కేటాయించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 12 ఎస్సి స్టడీ సర్కిల్ సెంటర్లలో సంవత్సరానికి రెండు బ్యాచ్స్ తో 2400 మంది పేద ఎస్సి విద్యార్థులకి ఉచితంగా కోచింగ్ ఇవ్వవలసి ఉండగా .. దాదాపు 12 నెలలుగా ఎటువంటి కాంపిటేటివ్ కోచింగ్ ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రకటిస్తున్న ప్రస్తుత సమయంలో ఎస్సి స్టడీ సర్కిలల్లో ఉచిత కోచింగ్ అందుబాటులో లేకపోవడంతో ఎస్సి విద్యార్థులు పోటీ పరీక్షల్లో వెనకబడి తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పోటీ పరీక్షల్లో ఉండే పోటీని తట్టుకొని ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాలంటే ఖచ్చితంగా కోచింగ్ అవసరమని... పేద పరిస్థితిలో ఉన్న ఎస్సి విద్యార్థులు ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో అధిక ఫీజులు చెల్లించే పరిస్థితి లేదు కాబట్టి.. ఉద్యోగాలు సాధించే అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ఎస్సీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నిధులను మంజూరు చేయించి ఎస్సి స్టడీ సర్కిల్స్ లో ఉచిత కోచింగ్ ఇప్పించుటకు చర్యలు తీసుకోవాలని కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## 23, 24 తేదీల్లో గ్రూప్-2 మూడో విడత సర్టిఫికెట్ వెరిఫికేషన్

### తెలుగు విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో నిర్వహణ

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** గ్రూప్–2లో ఎంపికైన మెరిట్ జాబితాలోని అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను ఈ నెల 23, 24 తేదిల్లో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన హాల్ టికెట్ల వివరాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు కమిషన్ కార్యదర్శి ప్రియాంక అల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్–2 పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ నెం.28/2022 ను డిసెంబర్ 29,2022న జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచబడిన హాల్ టికెట్ల అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈ నెల 23, 24 తేదిల్లో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సురవరం ప్రతాప్ రెడ్డి విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్నట్టు ప్రకటనలో తెలిపారు. 23, 24నన సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కాని వారి కోసం ఈ నెల 25న రిజర్వ్ డేగా ప్రకటించారు. అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 22 నుంచి 25 వరకు టిజిపిఎస్‌సి వెబ్‌సైట్‌లో వెబ్‌ఆప్షన్‌లను ఉపయోగించుకోవాలని సూచించారు. అభ్యర్థి వెబ్‌ఆప్షన్‌లను ఉపయోగించేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని.. ఈ వెబ్‌ఆప్షన్‌లను తుది ఎంపిక కోసం పరిగణనలోకి తీసుకుంటారని తెలిపారు.

## కెఏ పాల్‌పై కేసు నమోదు

### లైంగికంగా వేధించాడని బాధిత మహిళ ఫిర్యాదు

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కే.ఏ.పాల్ పై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తాను లైంగికంగా వేధించాడని కెఏ పాల్‌పై బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. దగ్గరగా ఆనుకుని కేఏ పాల్ మాట్లాడాడు అని యువతి ఆరోపించింది. పాల్ ఆఫీసులో పనిచేస్తున్న ఒక యువతి..తనను లైంగికంగా వేధిస్తున్నారని షీ టీమ్స్‌ను ఆశ్రయించింది. దీనికి సంబంధించిన వారి వాట్సాప్ మెసేజ్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం షీ టీమ్స్ కేసును పంజాగుట్ట పోలీసులకు ట్రాన్స్‌ఫర్ చేసింది.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నన్ను కుటుంబానికి దూరం చేసిన వారి భరతం పడతా

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** కుట్రలు చేసి నన్ను కుటుంబానికి దూరం చేసిన వారిని నేను వదిలిపెట్టే ప్రసక్తి లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని మాజీ సిఎం కెసిఆర్ స్వగ్రామం చింతమడకకు బతుకమ్మ సంబరాలలో మొదటి రోజు ఆదివారం పాల్గొనడానికి వచ్చిన ఆమెకు గ్రామస్తులు డప్పు చప్పుళ్లు, మంగళహారులతో ఘన స్వాగతం పలికారు. ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలలో పాల్గొని గ్రామ మహిళలతో అడిపాడారు. అంతకు ముందు ఆమె గ్రామస్తులనుద్దేశించి మాట్లాడారు. చింతమడక గడ్డ చిరుతపులిని కన్న గడ్డ.. ఇక్కడి నుంచే బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ భూకంపం సృష్టించి తెలంగాణ సాధించారని వివరించారు. చింతమడక గ్రామ ప్రజలు వెంట ఉంటే ఎద్దైనా సాధించవచ్చునని తెలిపారు.

చింతమడక గ్రామస్తులు కెసిఆర్‌ను చంద్రుడు అంటారని అలాంటి చంద్రునికి కొంత మంది మచ్చ తెచ్చిపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. చింతమడక గ్రామ ప్రజలు ఇచ్చిన ధైర్యంతోనే అనాడు తెలంగాణ ఉద్యయంలో బతుకమ్మను ఎత్తుకొని తిరిగానని తెలిపారు. 2004 కెసిఆర్ సిద్దిపేట నుంచి వెళ్లిపోయిన తర్వాత ఇక్కడ ఓ నాయకున్ని తెచ్చిపెట్టారని ఆ నాయకుడు నేడు

> **సిద్దిపేట ఎవరి జాగీర్ కాదు..**
> **కెసిఆర్‌కు కొందరు మచ్చ తెచ్చారు**
> **ఇక నుంచి చింతమడక, సిద్దిపేట వస్తూనే ఉంటా: కవిత**

చింతమడకకు, సిద్దిపేటకు రావాలంటే రాజకీయ ఆంక్షలు పెడుతున్నారని ఆంక్షాలు గింక్షలు నై జాన్తా సిద్దిపేట ఎవరి జాగీర్ కాదు ఇక్కడ ఎవరి ఆంక్షలు పని చేయవు ఇక నుంచి చింతమడకు, సిద్దిపేటకు మళ్లీ, మళ్లీ వచ్చి తీరుతానని తీవ్ర అగ్రహంతో అన్నారు. చింత మడకలో పుట్టిన కెసిఆర్ తెలంగాణ సాధించి మీరు తల ఎత్తుకొని బతికే గుర్తింపు తెచ్చారని మీ మేలు జన్మలో మరిచిపోనని తెలిపారు.

కుటుంబానికి దూరం చేశారని బాధలో ఉన్నాను.. దుఃఖంలో ఉన్నప్పుడు అండగా ఉన్న వారే చాలా గొప్పవారని కవిత కన్నీరు పెట్టుకున్నారు. చింతమడకతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది ఈ యేడు నేను చాలా ఇబ్బందులు పడ్డానని తెలి పారు. మీరు అండగా ఉంటే చింతమడక గడ్డకు ఎంత పౌరుషం ఉందో చూపిస్తానని తెలిపారు. తల్లికి పిల్లని పాపిన వారి భరతం పడుతానని హెచ్చరించారు. భవిష్యత్‌లో సొంతూరే కర్మ భూమి కావచ్చని వ్యాఖ్యనించారు. ప్రత్యేక పరిస్థితుల్లో నన్ను రమ్మని అక్కున చేర్చుకున్న ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బతుకమ్మను తీసుకెళ్తున్న ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కవిత

## ఆదిలాబాద్‌లో ఒకే ప్లాట్ ఇద్దరికి రిజిస్ట్రేషన్

### ముగ్గురి అరెస్టు.. సబ్‌రిజిస్ట్రార్‌పై కేసు నమోదు

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ జిల్లాలో ఓ ప్లాట్‌ను సబ్‌రిజిస్ట్రార్ ఇద్దరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేయగా బాధితుడి ఫిర్యాదు మేరకు సబ్ రిజిస్ట్రార్‌పై పోలీసులు కేసు నమోదు చేసిన పోలీసులు మరో ముగ్గురిని అరెస్టు చేశారు. వివరాలు ఇలావున్నాయి. ఆదిలాబాద్ పట్టణం లో మిలింద్ అనే వ్యక్తికి చెందిన ప్లాట్‌ను సబ్‌రిజిస్ట్రార్ అశోక్ మరోవ్యక్తికి రెండో సారి రిజిస్ట్రేషన్ చేశాడు. ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న మిలింద్ దీనిపై జిల్లా ఎస్‌పి అఖిల్‌మహాజన్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు సబ్‌రిజిస్ట్రార్‌పై కేసు నమోదు కాగా ఇదే కేసులో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి వెంకటరమణ, మాజీకౌన్సిలర్ రఘుపతి, రిమ్స్ ఉద్యోగి టెజ్జవార్ సంజీవ్ కుమార్‌ను అరెస్టుచేయగా పరారీలో వున్న అశోక్ కోసం గాలిస్తున్నారు.

## దసరా సెలవుల్లో ప్రైవేటు విద్యాసంస్థలు కొనసాగిస్తే ప్రత్యక్ష ఆందోళనలు

### ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** ఈ నెల 21 నుంచి రాష్ట్రంలోని పాఠశాలలకు ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించిన నేపథ్యంలో .. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు విద్యాసంస్థలను నడపకుండా చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాష్ట్రంలో ప్రభుత్వం విద్యాసంస్థలకు సెలవులు ఇచ్చిన ప్పటికీ.. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు నడుపుతున్నారని.. విద్యా సంస్థ లు నడపకుండా చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖాధికారులు విద్యా సంస్థ లకు దాసోహమవుతూ తాయిలాలు తీసుకుని చర్యలు తీసుకోవడం లేదని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు విమర్శించారు. దసరా సెలవుల్లో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు నడిపిస్తే విద్యా సంస్థల ముందు ప్రత్యక్ష ఆందోళనలు నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు. ప్రభుత్వం దసరా సెలవులు ఇచ్చిన నేపథ్యంలో విద్యార్థులకు సెలవులు ఇచ్చి మానసిక ప్రశాంతత ఉండేలా చూడాలని.. అలా కాకుండా విద్యాసంస్థలను కొనసాగిస్తే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

## మాజీ డిఎస్‌పి నళిని 'మరణ వాంగ్మూలం' కలకలం

### ప్రభుత్వం సహాయం చేయలేదంటూ ఆవేదన

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** ఉమ్మడి ఎపిలో 2007లో గ్రూప్ వన్ అధికారిగా పోలీసు శాఖలో డిఎస్‌పిగా చేరిన నళిని ఆ తరువాత తెలంగాణ ఉద్యమం నేపథ్యంలో రెండుసార్లు రాజీనామా చేసి సంచలనం సృష్టించగా తాజాగా ఫేస్ బుక్‌లో అనారోగ్యంపై మరణ వాంగ్మూలం అం టూ పోస్ట్ చేయడం కలకలం రేపింది. తాను స్థాపించిన వేద యజ్ఞ పరిరక్షణ సమితికి ప్రభుత్వం సహాయం చేయకపోవడంపై ఈ సందర్భంగా ఆ మె ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం నాడు నళిన తన ఫేస్ బుక్‌లో చేసిన పోస్ట్‌పై పోలీసు శాఖ ఆరా తీయసాగింది.

పోలీసు శాఖలో కొన్నేళ్లు మాత్రమే పనిచేసిన వరంగల్ వాసి నళిని మొదట తెలంగాణ ఉద్యమ సమయంలో రాజీనామ చేయగా ఆ సమయంలో ఆమె మెదక్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే అప్పుడు శాంతి భద్రతల అదనపు డిజిగా వున్న ఎ.కె ఖాన్ నళినికి కౌన్సిలింగ్ ఇచ్చి రాజీ నామాను వెనక్కు తీసుకునేలా చేశారు. దీని తరువాత కొన్ని నెలలకు ఆమె మళ్లీ రాజీనామ చేశారు. అయితే ఏడాది తరువాత అప్పటి ఉమ్మడి ఎ పి సిఎం రోశయ్య హయాంలో మహిళా దినోత్సవం రోజున నళినికి మళ్లీ డిఎస్‌పి ఉద్యోగం ఇచ్చారు. ఆ తరువాత కొంతకాలం విధులు నిర్వహించి న నళిని 2014 ఎన్నికల వేళ ఉద్యోగానికి రాజీనామా చేసి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్నారు. అప్పట్లో నళిని రాజీనామ పోలీసు శాఖలో తీవ్ర సంచలనం రేపింది. మొత్తం మీద పోలీసు శాఖలో రెండుసార్లు రాజీనామా చేసిన అధికారిగా ఆమె రికార్డులకెక్కారు. ఆ తరువాత 2014 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఎల్‌ఎగా పోటీచేసేందుకు ఆమె ప్రయత్నాలు చేశారు.

దీని తరువాత పలు సందర్భాలలో తెలంగాణ ఉద్య మం గురించి ఆమె తన గొంతు వినిపించారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలో వచ్చాక ఏడాది క్రితం సిఎం రేవంత్ రెడ్డిని నళిని కలవడం ప్రాధాన్య తను సంతరించుకుంది. నళినికి తిరిగి పోలీసు శాఖలో ఉద్యోగం ఇచ్చేందుకు సర్కారు నిర్ణయించినా అందుకు ఆమె తిరస్కరిం చారు. ఇప్పుడు తన శరీరం అందుకు సహకరించదని, తాను వేద యజ్ఞ పరిరక్షణ సమితిని స్థాపించానని, దీని ద్వారా ధర్మ పరిరక్షణకు కృషి చేస్తానని, ఇందుకు సర్కారు తరపున సహాయం కావాలని ఆమె సిఎంను కోరారు. తన వినతికి సిఎం సానుకూలంగా స్పందించారని నళిని మీడియాకు తెలిపారు.

ప్రస్తుతం ఆమె స్థాపించిన వేద యజ్ఞ పరిరక్షణ సమితి సంస్థ వరంగల్‌లో కొనసాగుతోంది. అయితే వున్నట్లుడి ఆదివారం నాడు నళిని మరణ వాంగ్మూలం పేరిట ఫేస్ బుక్‌లో పెట్టిన పోస్ట్ కలకలం రేపింది. తన ఆరోగ్యం బాగాలేదని, ప్రభుత్వం నుంచి తనకు ఎలాంటి సహాయం అ ందక పోవడం మరింత బాధించిందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. తెలంగాణ పోరాటంలో నిలువెల్లా గాయాలు అయ్యాయని, అయినా తా ను ధైర్యంతో ముందుకు వెళుతున్నట్లు ఆమె తెలిపారు. ఒకవేళ తాను చనిపోతే తన గురించి ఎవరైనా వార్తలు రాస్తే సస్పెండెడ్ అధికారిగా రాయవ ద్దని, రిజైన్‌డ్ అధికారిగా రాయాలని ఆమె కోరారు.

తనను కవయిత్రి, యజ్ఞ బ్రహ్మగా సంబోధించాలని ఆమె కోరారు. కాగా నళిని పోస్ట్‌పై పోలీసు శాఖ ఆరా తీస్తోంది. ఆమె పోస్ట్ వెనుక గల కారణాలను ఆరా తీయసాగింది.

## హెచ్-1బి వీసా ఫీజు పెంపు సరైన నిర్ణయం కాదు

### మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** అమెరికా ప్రభుత్వం హెచ్–1బి వీసా ఫీజును సుమారు రూ.90 లక్షలు (1 లక్ష అమెరికన్ డాలర్లు) వరకు పెంచిన నిర్ణయంపై రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇండో–అమెరికా సంబంధాల బలం ప్రతిభ, సాంకేతికత పరస్పర మార్పిడిలో ఉందని.. ఇంత భారీగా ఒక్కసారిగా ఫీజు పెంపు చేయడం భారత యువతపై, అంతర్జాతీయ స్థాయిలో పనిచేస్తున్న కంపెనీలపై తీవ్రమైన అనిశ్చితి కలిగిస్తుందన్నారు. హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకొని అమెరికాకు వెళ్తున్న వేలాది మంది ఐటీ నిపుణులు ఈ నిర్ణయం వల్ల ఉద్యోగ, వ్యాపార అవకాశాలపై ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. అమెరికా ప్రభుత్వం ఈ విషయంలో ఆర్థిక, వ్యాపార పరమైన దుష్పరిణామాలను అర్థం చేసుకునేలా ఐటీ కంపెనీలు, పరిశ్రమ సంఘాలు, ఎన్ఆర్ఐ నెట్‌వర్కులు ఒకే వేదికపైకి రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

## తెలంగాణ ఉక్కు మనిషి కొండా లక్ష్మణ్ బాపూజీ

### పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 21,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన త్యాగమూర్తి, స్వయం పాలన కోసం వలసవాదులపై నిరంతరం భావసంఘర్షణ చేసిన తెలంగాణ ఉక్కు మనిషి కొండా లక్ష్మణ్ బాపూజీ అని పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కొనియాడారు. ఆదివారం నెక్లెస్‌రోడ్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని విగ్రహానికి నివాళులు అర్పించారు. తెలంగాణ వార్ రూం ఇంచార్జ్ అనుష,బిసి సంఘం నాయకులు, పలువురు నేతలు పాల్గొన్నారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కొండలక్ష్మణ్ తెలంగాణ భావవ్యాప్తి కోసం తన జీవితంను ధారపోశారని కీర్తించారు. తెలంగాణ ఉద్యమం మలిదశలో విజయవంతం అవడానికి ఆయన ఎంతగానో కృషిచేశారని అన్నారు. లక్ష్మణ్ అనుసరించిన మార్గం నేటి యువతకు మార్గదర్శకమని అన్నారు. కొండ లక్ష్మణ్ బాపూజీ లాంటి నాయకులు అరుదని,త్యాగధనుడనిశ్లాఘించారు. బిసిలు మా వాట ఏది అనే స్థితికి వచ్చామంటే ఆయన పోరాటపటిమనే అన్నారు.

**విలువలతో కూడిన రాజకీయాలను కొనసాగించిన గొప్పవ్యక్తి : మధుయాష్కీ**

విలువలతో కూడిన రాజకీయాలను కొనసాగించిన గొప్ప వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని టిపిసిసి ప్రచారకమిటి చైర్మన్ మధుయాష్కీ అన్నారు.ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి పురస్కరించుకొని ట్యాంక్ బండ్ వద్ద ఆదివారం ఆయన విగ్రహానికి టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్‌విశారదన్ మహ రాజ్, నారగోని, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులతో కలిసి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. మధుయాష్కి మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ గారితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తాను ఎంపీగా పని చేసినప్పుడు తెలంగాణ ఏర్పాటు, తది తర విషయాలపై పలుమార్లు వారితో మాట్లాడిన జ్ఞాపకాలను మర్చిపోలేనని పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని పేర్కొన్నారు. సాధించినది సగం తెలంగాణ మాత్రమేననీ సామాజిక తెలంగాణ సాధించాల్సి ఉందని అన్నారు. బహుజన వర్గాలకు రాజ్యాధికారం సాధించడమే కొండా లక్ష్మణ్ బాపూజీకి నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఇందుకు బహుజన వర్గాలు ఐక్యంగా పని చేయాలన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బిసి, ఎస్సీ, ఎస్టీ వర్గాలు తీవ్ర అన్యాయం గురయ్యాయని పేర్కొన్నారు. తమ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాలకు ప్రాధాన్యత లభిస్తుందనీఎవరి డిమాండ్లనైనా విని పరిష్కరించే ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు.



కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన విగ్రహానికి నివాళులర్పిస్తున్న పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్

## బతుకమ్మ, దసరా దృష్ట్యా బిగ్ బాస్-9 షోను నిలిపివేయాలి

### ఒయు జెఏసి అధికార ప్రతినిధి బోనాల నగేష్ డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు భంగం కలిగిస్తున ్న రియాల్టి షో 'బిగ్ బాస్–9' ను బతు కమ్మ, దసరా పండుగల సందర్భంగా రాష్ట్రంలో నిలిపివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఒయు జెఏసి అధికార ప్రతినిధి బోనాల నగేష్ డిమాండ్ చేశారు.




సమావేశంలో మాట్లాడుతున్న నగేష్

ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిగ్ బాస్–9 షో పేరిట తెలంగాణ సంస్కృతిని, అస్థిత్వాన్ని దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నటువంటి ఆంధ్ర పెత్తందారుల కుటీల ప్రయత్నాన్ని ఇకనైనా మానుకోవాలని డిమాండ్ చేశారు. నాటి శాతవాహనుల కాలం నుంచి నేటి వరకు బతుకమ్మను పూజిం చడం వారసత్వంగా వస్తున్నదని, ఇది తెలంగాణ ప్రత్యేకతని, భగవంతుడికి సమర్పించే పూలను గౌరవించి పూజించే సంస్కృతి ప్రపంచంలో ఎక్కడా లేదని, ఒక్క తెలంగాణలోనే ఉందన్నారు. బిగ్ బాస్ షోను నిర్వ హిస్తున్న ప్రముఖ సినీనటుడు నాగార్జున తక్షణమే షోకు బంద్ పెట్టాలని, లేనిపక్షంలో అన్నపూర్ణ స్టూడియో, ఆయన ఇంటిని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో విద్యార్థులు సందీప్, దప్పు గోపి, గడ్డం శ్రీకాంత్, నరేష్, సాయికుమార్, అనిల్, శ్రీకాంత్, నవీన్ పాల్గొన్నారు.

## విద్యాహక్కు చట్టాన్ని సవరించాలి

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి. శ్రీపాల్‌రెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** భారతదేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులకు విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 23(2)ను సవరిస్తూ టెట్ పరీక్ష నుండి మినహాయింపునిస్తూ చట్టాన్ని సవరించాలని నల్గొండ–వరంగల్– ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు కేంద్రమంత్రి గంగాపురం కిషన్ రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం సమర్పించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పుల్లం దామోదర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రెడ్డి, నాయకులు నవీన్‌రెడ్డి, గిరిధర్ ఉన్నారు. స్పందించిన కేంద్రమంత్రి త్వరలోనే కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ని కలిసి తమ ప్రాతినిధ్యాన్ని మంత్రి దృష్టికి తీసుకువెళ్ళి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ నిబంధనల అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తగు ప్రతిపాదనలు పంపిస్తే కేంద్ర హోంశాఖ నుండి ఉత్తర్వులు ఇప్పిస్తానని కేంద్ర మంత్రి చెప్పినట్టు తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుండి అదనపు నిధులు మంజూరు చేయుటకు ప్రధాని నరేంద్ర మోడీని కలిసి ప్రాతినిధ్యం చేస్తానని చెప్పారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపట్ల సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## నెక్లెస్‌రోడ్డులో నమో యువ రన్ 3కె మారథాన్

### ఇలాంటి కార్యక్రమాలు చైతన్యానికి దోహదం చేస్తాయి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్ (బేగంపేట) సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** శక్తివంతమైన యువత మేధస్సుతో ప్రపంచాన్ని శాసించగల సత్తా భారత్ యువతకు ఉందని, కేంద్ర ప్రభుత్వం డ్రగ్స్‌ఫ్రీ కంట్రీ కోసం అనేకచర్యలు చేపడుతుందని, ఇలాంటి కార్యక్రమాలు యువతను, వారి తల్లిదండ్రులను చైతన్యం చేసేందుకు దోహదం చేస్తాయని కేంద్రమంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి అన్నారు. ప్రధాని మోడీ పుట్టినరోజు సందర్భంగా యువత కోసం బీజేవైఎం ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ పేరిట ఆదివారం నెక్లెస్ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం నుంచి 3కే మారథాన్ నిర్వహించారు. ఈ మారథాన్‌లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొని జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.మోదీ 75ఏళ్ల సందర్భంగా నషా ముక్త్ భారత్ పేరుతో యువతను చైతన్యాన్నిచ్చేదే ఈ 3కే రన్ కార్యక్రమం అన్నారు.మోదీ పాలనలో ఒక్క అవినీతి కూడా జరగలేదన్నారు.ప్రపంచంలోనే అత్యంత ప్రాచుర్యం పొందిన నాయకుడు మోదీ అన్నారు.11 యేళ్లుగా దేశంలో సమూల సంస్కరణలు తెస్తూనే ఉన్నారన్నారు. యువతకు అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధిలోకి రావాలని, స్వదేశీ భావజాలంతో ముందుకు వెళ్లాలన్నారు. స్వదేశీ సంపదను ఉపయోగించుకోవాలంటే స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలన్నారు.మన దేశంలో తయారైన వస్తువులను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. ప్రాథమిక పాఠశాలల నుంచి మొదలు కొని యూనివర్శిటీల వరకు బస్తీల నుంచి టెక్ కంపెనీల వరకు చిన్న చిన్న పరిశ్రమల నుంచి పెద్ద పెద్ద కంపెనీల వరకు డ్రగ్స్ పెద్ద సమస్యగా మారిందన్నారు. 2047వరకు ప్రపంచంలో భారత్ నెంబర్ వన్ దేశంగా అవతరించాలని దేశం అభివృద్ధి చెందాలనే మోడీ కల సాకారం కావాలంటే ఈ దేశం నుంచి డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టాల్సిందేనన్నారు.మన టాలెంట్‌ను భయపెట్టాలంటే నో డ్రగ్స్ పేరుమీద ప్రతిజ్ఞ తీసుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు,ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, అంజిరెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు ప్రేమ్ సింగ్ రాథోడ్, లంకల దీపక్‌రెడ్డి, గువ్వల బాలరాజ్, మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి బీజేవైఎం నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వచ్చే దశాబ్దానికి కూడా మోడీయే ప్రధాని

### రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో కూడా ప్రధానిమోడీయే ప్రధాని అభ్యర్థి అవుతారని రక్షణ మంత్రి రాజ్‌నాత్‌సింగ్ స్పష్టంచేసారు. దేశంలో ఎన్నిసార్లు ఎన్నికలు జరిగినా ప్రధాని పోస్టుకు ఖాళీలేదని, అది మోడీకే కేటాయించినట్లు రాజ్‌నాథ్ వెల్లడించారు. ప్రధానిమోడీతో తనకున్న సాన్నిహిత్యాన్ని ఆయన ఈసందర్భంగా ప్రస్తావించారు. 1980నుంచి ఆయనతో తనకు సన్నిహిత సంబంధాలున్నాయన్నారు. ప్రజలతో మమేకం అయ్యే విధంగా ఆయనకున్న వైవిధ్యభరితమైన తీరు మరెవ్వరికీ లేదని, సంక్షోభాల్లో ఆయన కీలక నిర్ణయాలు తీసుకోగలుగుతారన్నారు. ప్రధాని నాయకత్వంలో ఎలాంటి మార్పు ఉండబోదని, 2029, 2034 ఆపై ఐదేళ్లలో కూడా ప్రధానిగా మోడీయే నిలుస్తారని రక్షణ మంత్రిరాజ్‌నాథ్‌సింగ్ స్పష్టంచేసారు.ప్రపంచంలోని టాప్ లీడర్లు సైతం అంతర్జాతీయ అంశాలకు సంబంధించి ఆయన సలహాలు కోరతారని గుర్తుచేసారు. ప్రపంచదేశాధినేతలు లెక్కకుమించిన సంఖ్యలో జన్మదినశుభాకాంక్షలు చెప్పిన సంఘటనలు గతంలో లేవని అన్నారు. మోడీ పనితీరుకు పహల్గాం ఉగ్రదాడి తర్వాత స్పందించిన తీరే నిదర్శనం అన్నారు. ఆపరేషన్ సిందూర్‌నిర్వహణకు మిలిటరీకి పూర్తి స్వేచ్ఛ నిచ్చారని ఆయన గుర్తుచేసారు. 2013లో అప్పటి గుజరాత్ సీఎంగా ఉన్న మోడీని బిజెపి ప్రచార కన్వీనర్‌గా నియమించిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన్నే ప్రధాని అభ్యర్థిగా ప్రకటించామని దీనికి పార్లమెంటరీ బోర్డుకూడా సంపూర్ణ మద్దతిచ్చిం దన్నారు. ఎల్‌కె అద్వానిపట్ల ఎలాంటి అగౌరవం తమకు లేదన్నారు. మోడీ నాయకత్వాన్ని దేశం డిమాండ్‌చేసిందని అందుకే మోడీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించామన్నారు. 2014 ప్రచారంతో మేం తరచూ ప్రయాణిం చామన్నారు. వోట్ల చోరీ అన్న విపక్షాల ప్రచారం నిరాధారమైనదన్నారు. ఆధారాలుంటే వారు కోర్టుకు వెళ్లవచ్చన్నారు.

# కొత్త పోలీసు బాస్ ఎవరో?

**నిఘా విభాగం, సిటీ కొత్వాల్‌లో ఒకరికి అవకాశం**

**30న నూతన డిజిపి బాధ్యతల స్వీకరణ**

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు శాఖకు కొత్త బాస్ ఎంపికపై సర్కారు ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈ నెలాఖరున పదవీవిరమణ చేయనున్న జితేందర్ స్థానంలో నూతన డిజిపిగా నిఘా విభాగం బాస్ శివధర్‌రెడ్డి లేదా సిటీ కొత్వాల్ సి.వి ఆనంద్‌లలో ఒ కరిని నియమించే అవకాశాలున్నాయి. సీనియారిటీ ప్రకారం హోం శాఖ ప్రత్యేక కార్యదర్శిగా వున్న 1990 బ్యాచ్ అధికారి రవి గుప్తా ముందు వ రుసలో వుండగా ఆయన తరువాత స్థానంలో 1991 బ్యాచ్ అధికారి, నగర పోలీసు కమిషనర్ సి.వి ఆనంద్ వున్నారు. అయితే రవి గుప్తా వచ్చే డిసెంబర్ నెలలో పదవీ విరమణ చేయనుండడంతో పాటు ఇదివరకే ఒకసారి డిజిపిగా పనిచేయడంతో కొత్త డిజిపి ఎంపికలో ఆయన పేరును సరా ్కరు పరిగణలోకి తీసుకోలేదని తెలిసింది. ఆనంద్‌కు మూడేళ్ల సర్వీసు వుండడం అనుకూలించే అంశం. వీరి తరువాత 1994 బ్యాచ్ అధికారి కేంద్ర సర్వీసులో వున్న వినాయక్ ప్రభాకర్ ఆప్టే, ఇదే బ్యాచ్‌కు చెందిన తెలంగాణ పోలీసు అకాడమి డైరక్టర్ అభిలాష్ బిస్త్, నిఘా విభాగం అధిపతి శివ ధర్ రెడ్డి, జైళ్ల శాఖ డిజిగా వున్న సౌమ్యా మిశ్రా, సిఐడి అధిపతిగా వున్న శిఖా గోయల్‌లు సీనియర్లుగా వున్నారు. ఇందులో శివధర్ రెడ్డి మినహా మిగతా అందరికి రెండేళ్ల నుంచి ఐదేళ్ల వరకు సర్వీసు వుంది.

రాష్ట్ర పోలీసు శాఖకు కొత్త బాస్ ఎంపిక చివరిదశకు చేరింది. కొన్నేళ్లుగా డిజిపి ఎంపిక చివరి నిమిషంలో జరుగుతుండడం తెలిసిందే. ఈసారి కూడా ఇదే విధంగా సెప్టెంబరు 30వ తేదీన కొత్త డిజిపిపై సర్కారు ప్రకటన చేసే వీలుందని తెలిసింది. ఇలా ప్రకటన వచ్చిన వెంటనే కొత్త డిజిపి బాధ్యతలు స్వీకరించే వీలుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక తొలి డిజిపి అనురాగ్ శర్మ, రెండవ డిజిపిగా మహేందర్ రెడ్డి, మూడవ డిజిపి గా అంజనీ కుమార్‌లను అప్పట్లో మొదట ఇంఛార్జి డిజిపిలుగా ఆ తరువాత పూర్తిస్థాయి బాస్‌లుగా నియమించారు. అయితే 2023 అసెంబ్లీ ఎన్ని కల వేళ ఎన్నికల సంఘం ఆదేశాలతో నాటి డిజిపి అంజనీ కుమార్‌పై సస్పెన్షన్ వేటుపడగా హోం శాఖ కార్యదర్శిగా వున్న రవి గుప్తా డిజిపిగా బా ధ్యతలు చేబట్టారు. అయితే గత ఏడాది జూలై పదవ తేదీన అనూహ్యంగా డిజిపిగా వున్న రవి గుప్తాను ఏడు నెలలకే సర్కారు బదిలీ చేసింది. ఆ యనను హోం శాఖకు బదిలీ చేసి అక్కడ వున్న జితేందర్‌ను డిజిపిగా నియమించారు. యుపిఎస్‌సి నిబంధనల మేరకు జితేందర్ రెండేళ్ల పాటు డి జిపిగా వుండాల్సి వుంది. ఈ లెక్కన ఆయన 2026 జూలై వరకు ఆయన డిజిపిగా కొనసాగాల్సి వుంది. అయితే ఆయన నియామకంపై కేంద్రం నుంచి, యుపిఎస్‌సి నుంచి అభ్యంతరాలు రాలేదు. ఈ కారణంగా ఆయన ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనుండడంతో కొత్త డిజిపి ఎంపిక అనివార్యం అయ్యింది. ఇక డిజిపి రేసులో నిఘా విభాగం అధిపతి శివధర్ రెడ్డి, సిటీ కొత్వాల్ ఆనంద్‌ల పేర్లను సర్కారు పరిశీలిస్తున్నట్లు తెలిసిం ది. గత ఏడాది సీనియర్ ఆనంద్‌ను కాదని సర్కారు 1992 బ్యాచ్ అధికారి జితేందర్‌ను నియమించడం తెలిసిందే.

ఈసారి తనకు న్యాయం జరి గేలా చూడాలని ఆనంద్ తన వంతు ప్రయత్నాలు చేయసాగారు. అయితే ప్రభుత్వం చివరి నిమిషంలో ఎవరినైనా నియమించే అవకాశాలున్నాయని వార్తలు వస్తున్నాయి. శివధర్ రెడ్డికి ఏడు నెలల సర్వీసు మాత్రమే వుండడంతో మొదట ఆయనను డిజిపిగా నియమించి ఆయన తరువాత ఆనంద్ కు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఒకవేళ శివధర్ రెడ్డిని డిజిపిగా నియమిస్తే ఆనంద్‌ను ఎసిబి, విజిలెన్స్‌కు బా స్‌గా నియమించే వీలుంది. దీంతో పాటు నిఘా విభాగం, సిటీ పోలీసు కమిషనరేట్‌లకు కొత్త బాస్‌లను నియమించాల్సి వుంది. ఈ రెండు పోస్టు లకు మహేష్ భగవత్, సజ్జన్నార్‌ల పేర్లు వినిపిస్తున్నాయి.

ఒకవేళ మహిళాధికారిని డిజిపిగా నియమించాలని సర్కారు భావిస్తే సీనియారిటీలో ముం దు వరుసలో వున్న పోలీసు అకాడమి డైరక్టర్ అభిలాష్ బిస్త్, జైళ్ల శాఖ డిజిగా వున్న సౌమ్యా మిశ్రా, సైబర్ సెక్యూరిటీబ్యూరో అధిపతిగా వున్న శిఖా గోయల్‌లలో ఒకరికి అవకాశం దక్కే వీలుందని వార్తలు వస్తున్నాయి.

# రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌పై ప్రభుత్వం స్పష్టతనివ్వాలి

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్) అలైన్‌మెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనివ్వాలని సిపిఐఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మార్పుతోపాటు ఇతర సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనివ్వాల న్నారు. రైతులతో మాట్లాడకుండా, గ్రామ సభలు నిర్వహించకుండా, భూసేకరణలో స్పష్టతనివ్వకుండా బలవంతంగా భూములను తీసుకోవాలని ప్రయత్నం చేస్తే రైతుల నుండి తీవ్రమైన ప్రతిఘటన వస్తుందని.. అలాంటి పరిస్థితి రాకుండా రాష్ట్ర ప్రభుత్వం తన స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. 8 జిల్లాలు, 33 మండలాలు, 163 గ్రామాల పరిధిలో ఈ రోడ్డుకు 100 మీటర్ల వెడల్పుతో నిర్మించాలని హెచ్‌ఎండిఏ నోటిఫికేషన్‌ను ఇచ్చి, అందుకోసం భూములు తీసుకుంటామని ప్రకటించారని జాన్‌వెస్లీ గుర్తు చేశారు. అలాగే రైల్వే ట్రాక్ కొరకు మరొక 40 అడుగులవెడల్పుతో రోడ్డును పెంచుతామని ప్రభుత్వం చెబుతుందని.. ఇంతకు ముందు మొదటి అలైన్‌మెంట్ తయారుచేశారని తర్వాత దాన్ని మార్చి రెండవసారి అలైన్‌మెంట్ చేశారని ఇప్పుడు మూడో అలైన్‌మెంట్‌ను తయారుచేసి విడుదల చేశారన్నారు. ఇందులో రాజకీయ అండదండలు, డబ్బు, పలుకుబడి ఉన్న వారి భూముల్లోకి రోడ్డు మార్గం లేకుండా ఎకరం, రెండెకరాలు, మూడెకరాలున్న చిన్న సన్నకారు రైతులకు సంబంధించిన భూములున్న ప్రాంతాన్నే రింగ్ రోడ్డుకోసం తీసుకుంటున్న ట్లుగా పెద్దఎత్తున ఆరోపణలొస్తున్నాయన్నారు. భూములను నమ్ముకునే బ్రతుకుతున్నామని, తమకు మరో అవకాశం లేదని, భూములు ఇవ్వడానికి రైతులు తీవ్ర ఆందోళన చెందు తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రింగ్‌రోడ్డు అలైన్‌మెంటును ఎందుకు మార్చుతుందో స్పష్టత నివ్వాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. కేవలం కొద్దిమంది పెద్దల ప్రయోజనాల కోసం సామాన్యమైన చిన్నరైతుల జీవితాలను దెబ్బతీసేటువంటి వైఖరిని తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని.. ఆర్‌ఆర్‌ఆర్ భూబాధితుల సమస్యలపై ఈనెల 23న హైదరాబాద్‌లో ఆయా జిల్లాల, మండలాల బాధ్యులతో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని జాన్‌వెస్లీ స్పష్టం చేశారు.

# అక్టోబరు మొదటివారంలో బీహార్ ఎన్నికల నోటిఫికేషన్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేనెల మొదటివారంలోనే ఉండవచ్చన్న సంకేతాలు వెలువడ్డాయి. దీనితో రాజకీయ పార్టీల్లో మరింతగా జోరు పెరిగింది. రెండు విడతలుగా ఎన్నికు జరుగుతాయని పార్టీల్లోనే వినవస్తోంది. ఇక ఎన్నికల ప్రచారం పరంగా ఇండియా కూటమి రాహుల్‌గాంధీ,తేజస్వి యాదవ్‌ల ఆధ్వర్యంలోను, ఎన్డీయే కూటమికి బీహార్‌సీఎం నితీష్‌కుమార్‌లు నేతృత్వం వహిస్తున్నారు. ఇండియాకూటమి రాష్ట్రంలో నిరుద్యోగం పెరుగుదలనే ప్రధాన అంశంగా ప్రచారంచేస్తూ యువ ఓటర్లకు గ్యాలం వేస్తోంది. ఓట్‌చోరీ నినాదంతో కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రచారాన్ని ఉధృతంచేసింది. సామాజిక న్యాయం, రిజర్వేషన్లు, అధికారంలో వాటాల పంపకం దిశగా 2023లో చోటుచేసుకున్న అంశాలు నేటి ప్రచారానికి త తోడవుతున్నాయి. జనాభా పరంగా ఒబిసిలు ఇపుడు కీలకం అవుతున్నారు. మరింత వెనుకబడిన వర్గాలు 63శాతం జనాభాతో ఉన్నారు. యాదవులు 14శాతం, ఇబిసిలు 36శాతం, ఇతరులు కుష్వాహాలు, కుర్మిలు మిగిలిన జనాభాలో ఉన్నారు. ఎస్సీలు జనాభాలో 19శాతం ఉంటే అగ్రవర్ణాలు 15శాతం ఓటింగ్‌జనాభా ఉంది. ముస్లిలు రాష్ట్రజనాభాలో 17శాతం ఉంటే వీరిని ఒబిసిల్లోనేచేర్చారు. రాష్ట్రప్రభుత్వం రిజర్వేషన్లను 50శాతంనుంచి 65శాతానికి పెంచారు. విద్య, ఉద్యోగాల్లో ఈ రిజర్వేషన్లు ఉంటాయి. ఇవికాకుండా పదిశాతం ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు ఉంటాయి. దీనికిఓడు కేంద్రం గత ఏప్రిల్‌లో ప్రకటించిన జనాభా గణన కూడా బిజెపి ఎన్డీయేకు కలిసొస్తుందని అంచనా. ఒబిసిల్లో ఉపకులాల విభజన ఇపుడు కొంతమేర వివాదం రాజుకున్నప్పటికీ రాజకీయంగా పరిణతికలిగిన సీఎం నితీష్ వీటిని తనదైన శైలిలో సర్దుకుని పోతున్నారు.

# పత్తి అమ్మకానికి స్లాట్ బుకింగ్ తప్పనిసరి

### రైతులకు కొత్త చిక్కు

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పత్తి రైతులకు కొత్త చిక్కొచ్చిపడింది. ఈ సీజను నుండి ఇక తాము పండించిన పత్తిని అమ్ముకోవాలంటే స్లాట్ బుకింగ్ తప్పనిసరి చేస్తూ కాటన్ కార్పొరేషన్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా 45.85 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. గత ఏడాది సుమారు 210.20 క్వింటాళ్ల పత్తిని కాటన్ కార్పొరేషన్ కొనుగోలు చేసింది. ఇక ఈ సీజనులో పత్తి అమ్ముకునేందుకు గాను కొత్తగా కపస్ కిసాన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రతీ రైతు తాను పండించిన పత్తిని అమ్ముకోవాలంటే ఈ యాప్‌లో వారం రోజుల ముందే స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. స్లాట్‌లో నిర్దేశించిన సమయానికి రైతులు పత్తిన కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే రాష్ట్రంలో అధిక శాతం మంది రైతులు నిరక్షరాస్యతతో పాటు, మరి కొందరికి స్మాట్ ఫోన్లు లేక పోగా, వాటిని ఉపయోగించడంలో కూడా ఇబ్బందులు ఎదురవుతాయని అంటున్నారు.

# బంజారాలను ఎస్‌టి జాబితాలో చేర్చింది ఇందిరాగాంధీయే

### పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 21,ప్రభాతవార్త:** బంజారాలను షెడ్యూల్డ్ ట్రైబ్‌లో చేర్చిన చలువ ఇందిరాగాంధీదే అని పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నా రు. నెక్లెస్‌రోడ్‌లో ఆదివారం మాజీప్రధాని భారతరత్న ఇందిరాగాంధీ కాంస్య విగ్రహం వద్ద తెలంగాణ బంజారా భారతి ఆధ్వర్యంలో లంబడాలను షెడ్యూల్ ట్రైబ్ రిజర్వేషన్లలో చేర్చి 50 యేళ్లు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా టీపీసీసీ అధ్య క్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ హాజరై ఇందిరా గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించి మాట్లాడుతూ 'ఎవరు ఎంతనిష్పత్తిలో ఉంటే వారికి అంతవాటా' అనే రాహుల్‌గాంధీ నినాదానికి కట్టుబడి కుల సర్వే నిర్వహించామని సామాజిక తెలంగాణ నిర్మాణంకు బాటలు వేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, డిప్యూటీ స్పీకర్ రామచంద్ర నాయక్, తెలంగాణవార్ రూం ఇంచార్జ్ అనుష, మాజీ ఎంపీ రవీందర్ నాయక్, బంజారా భారతి అధ్యక్షుడు జగన్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. పిసిసి అధ్యక్షుడు మాట్లాడుతూ ఉక్కు మహిళ ఇందిరాగాంధీ దేశంలో విప్లవాత్మక నిర్ణయాలు తీసుకొచ్చారని అన్నారు. సీలింగ్ ఆక్ట్ ద్వారా పేదలకు భూములు పంచిన మహనీయురాలు ఇందిరాగాంధీ అని కొని యాడారు. అన్ని వర్గాలకు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం ఉందని తెలి పారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను నమ్మకండని హితవు చెప్పారు.

# నిలిచిన 40 గిగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులు

**● ఒప్పందాలకు ముందుకురాని సంస్థలు ● తిరిగి బిడ్ ఓపెన్ చేసేందుకు కేంద్రం యోచన ● విద్యుత్ నియంత్రణ కమిషన్‌చే ప్రత్యేక మార్గదర్శకాలు**

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పిపిఎ) లేకపోవడం వల్ల దేశ వ్యాప్తంగా 40 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు నిలిచిపోయాయి. పెరుగుతున్న డిమాండ్‌ను అధిగమించేందుకు, థర్మల్ పవర్ ప్రాజెక్టులకు ప్రత్యామ్నాయంగా కేంద్రం పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు ప్రోత్సాహం కల్పిస్తోంది. ఇందులో భాగంగానే పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు కేంద్రం బిడ్లు పిలిచినా, వాటిలో 40 గిగావాట్ల సౌర, పవన సామర్థ్య ప్రాజెక్టుల ఏర్పాటుకు సంస్థలేవీ ముందుకు రాక ఒప్పందాలు చేసుకోకపోవడంతో అవి పెండింగ్‌లో ఉండిపోయాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం వాటికి తిరిగి బిడ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ సీనియర్ కార్యదర్శి ఒకరు తెలిపారు. ఈ ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించిన ప్రయత్నాలు కొనసాగుతున్న ప్పటికీ, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (సిఈఆర్సీ) వర్చువల్ విద్యుత్ కొనుగోలు ఒప్పందాలకు మార్గదర్శకాలను విడుదల చేయనుంది. నిలిచిపోయిన ఈ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు ఫైనాన్సింగ్ అన్ లాక్ చేసే అవకాశం ఉంది. సౌర ప్రాజెక్టుల టారిఫ్ రేటు యూనిట్‌కు రూ.2.38 నుండి రూ.2.56 వరకూ ఉంటుందని, అలాగే వెనిల్లా విండ్‌కు యూనిట్‌కు రూ.3.70 నుండి 3.90 వరకూ ఉంటుందని తెలుస్తోంది. వర్చువల్ పిపిఎలు కార్పొరేట్ కొనుగోలుదారులు భౌతిక విద్యుత్ సరఫరాను తీసుకోకుండా పునరుత్పాదక ప్రాజెక్టులను ఆర్థికంగా అండర్‌రైట్ చేయడానికి అనుమతి స్తాయని, బదులుగా గ్రీన్ పవర్ ప్రొక్యూర్ మెంట్‌కు రుజువుగా పునరుత్పాదక ఇంధన ధృవీకరణ పత్రాలను పొందవచ్చని విద్యుత్ నియంత్రణ కమిషన్ పేర్కొంటోంది. ఇందువల్ల సాంప్రదాయ విద్యుత్ కొనుగోలు ఒప్పందాల అవసరం లేకుండా పర్యావరణ, సామాజిక మరియు పాలన సమ్మతి కోసం వాటాదారులకు గ్రీన్ లక్షణాలను పొందేందుకు వీలు కల్పించడంతో పాటు, 40 గిగావాట్ల కంటే ఎక్కువ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వడానికి ప్రాధాన్యత కలుగుతుంది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియాతో సంప్రదింపులు తర్వాత నిర్దిష్ట డెలివరీ కాంట్రాక్టులుగా అర్హత పొందేలా నియంత్రణ సంస్థ మార్గదర్శకాలను రూపొందిస్తున్నట్లు వెల్లడైంది.

# ఐఐటి ఖరగ్‌పూర్‌లో పిహెచ్‌డి విద్యార్థి ఆత్మహత్య

### ఈ యేడాది ఐదో ఘటన

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** దేశంలోని అత్యుత్తమ ఐఐటిలో ఒకటిగా పేరొందిన ఖరగ్ పూర్ ఐఐటిలో పిహెచ్‌డి చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. ఖరత్‌పూర్ ఐఐటిలో ఈ ఏడాది ఇది ఐదవ ఘటన కావడం గమనార్హం. వివరాలు ఇలావున్నాయి. జార్కండ్‌కు చెందిన హర్ష్‌కుమార్ పాండే (27) మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో పిహెచ్‌డి చేస్తున్నాడు. పాండే హాస్టల్‌లో వుంటున్నాడు. శనివారం మధ్యాహ్నం అతని తండ్రి మనోజ్ కుమార్ పాండే కుమారుడికి ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో అనుమానం వచ్చిన ఆయన సెక్యూరిటీ అధికారులకు సమాచారం అందించి వాకబు చేయమని కోరాడు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఐఐటి సెక్యూరిటీ అధికారులు అంబేద్కర్ హాల్‌లోని హర్ష్ కుమార్ గదికి రాగా లోపలి నుంచి గడియ పెట్టి వుంది. దీంతో సెక్యూరిటీ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చిన తరువాత అందరు కలిసి తలుపులను బద్దలు కొట్టగా హర్ష్ కుమార్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని వున్నాడు. వెంటనే హర్ష్ కుమార్‌ను క్యాంపస్‌లోని బిసి రాయ్ ఆసు పత్రికి తరలించగా అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ వి ద్యార్థి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అందజేశారు. కాగా ఈ ఏడాది ఐఐటి ఖరత్‌పూర్‌లో ఇప్పటి వరకు ఐదుగురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్ప డ్డారని అక్కడి విద్యార్థులు చెబుతున్నారు. ఈ నెల పదవ తేదీన ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ విద్యా సంస్థలో డైరక్టర్ సుమన్ సహా ఇతర అధ్యాపకులు విద్యార్థులతో కలిసి టార్చ్‌లైట్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో హర్ష్ కుమార్ కూడా పాల్గొన్నాడని అతని సహచరులు తెలిపారు. కాగా ఇంతకు ముందు ఈ విద్యా సంస్థలో ఈ ఏడాది ఏప్రిల్ నెలలో బిటెక్ చివరి సంవత్సరం విద్యార్థి అనికేత్ వాల్‌కర్ ఆత్మహత్య చేసుకోగా ఆ తరువాత మే నెల నాలుగవ తేదీన బిటెక్ మూడవ సంవత్సరం విద్యార్థి మహమ్మద్ ఆసిఫ్ ఖమర్ ఆత్మహత్య చేసుకున్నాడు. దీని తరువాత జూలై 18వ తేదీన బిటెక్ విద్యార్థి రితం మొండల్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. దీని తరువాత అదే నెలలో బిటెక్ మూడో సంవత్సరం విద్యార్థి షాన్ మాలిక్ బలవన్మరణానికి పాల్పడ్డాడు.

# ఆర్మూర్ పసుపునకు జిఐ దరఖాస్తు

### హార్టికల్చరల్ వర్సిటీ ప్రొ. సైదయ్య

**హైదరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** ఆర్మూర్ పసుపునకు భౌగోళిక గుర్తింపు (జీఐ) కోసం దరఖాస్తు చేసినట్టు తెలంగాణ హార్టికల్చరల్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పిడిగెం సైదయ్య తెలిపారు. ఈ మేరకు ప్రత్యేక బృందం ఆర్మూర్‌లో పర్యటించి పసుపు పంటను సందర్శించింది. ఈ సందర్భంగా సైదయ్య మాట్లాడుతూ చెన్నైలో ఆర్మూర్ పసుపు జీఐ రిజిస్ట్రీకి దరఖాస్తు చేయగా, సాంకేతికంగా రిజిస్ట్రీకి ఆమోదించినట్టు వెల్లడించారు. ఆవిర్భావ మూలం, రకాల లక్షణాలు, జీవ రసాయన ప్రొఫైలింగ్, రైతుల పద్ధతులు, డీఎన్‌ఏ ట్యాగింగ్ ఆర్మూర్ పసుపు రకం ప్రత్యేకత అని ఆయన చెప్పారు. యూపీ వారణాసిలో హ్యూమన్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా ఉన్న పద్మశ్రీ డాక్టర్ రజనీకాంత్, రైతుల తరఫున జీఐ టెక్నికల్ ఫెసిలిటేటర్‌గా వ్యవహరించినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ హార్టికల్చరల్ వర్సిటీ వీసీ డాక్టర్ దండ రాజిరెడ్డి మాట్లాడుతూ భౌగోళిక సూచిక (జీఐ) రిజిస్ట్రేషన్ ఆర్మూర్ పసుపును పండించే రైతులకు గేమ్‌చేంజర్ కానున్నట్టు తెలిపారు. ప్రీమియం ధర, మార్కెట్, ఎగుమతి సామర్థం వంటి ఆర్థిక, మార్కెట్ ప్రయోజనాలు జీఐ ట్యాగ్‌తో ముడిపడి ఉన్నట్టు స్పష్టంచేశారు.

# గాజుల రామారంలో హైడ్రా ఆపరేషన్

### పోలీసుల భారీ బందోబస్తు నడుమ అక్రమ నిర్మాణాల కూల్చివేత

### రూ.13 వేల కోట్ల విలువైన భూమి స్వాధీనం : హైడ్రా కమిషనర్ రంగనాథ్



అక్రమాలను కూల్చివేస్తున్న హైడ్రా సిబ్బంది

**హైదరాబాద్ (జీడిమెట్ల), సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** ప్రభుత్వ భూములలో వెలిసిన అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఆపరేషన్ చేపట్టింది. ఎన్నో ఏళ్లుగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఉక్కు పాదం మోపింది. రూ.13 వేల కోట్ల విలువైన 275 ఎకరాలకు పైగా భూమిని స్వాధీనం చేసుకుని, కంచె ఏర్పాటు సన్నద్ధమవు తున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ గాజులరామారం పరిధిలోని దేవేందర్ నగర్‌లో ప్రభుత్వ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను స్థానిక పోలీసులు, రెవెన్యూ, జిహెచ్‌ఎంసి అధికారల సహకారంతో భారీ బందోబస్తు నడుమ హైడ్రా అధికారులు జెసిబిలతో ఆక్రమాలను నేలమట్టం చేశారు. వివరాల్లోకి వెళితే.. కుత్బుల్లాపూర్ సర్కిల్ గాజులరామారం సర్వే నెంబర్ 307,308లోని ప్రభుత్వ భూమిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు 2014లో ప్రభుత్వం సుమారు 275 ఎకరాలు కేటాయించారు. అప్పటినుండి ఇట్టి భూములపై నియంత్రణ లేకపోవడంతో కబ్జారాయలు చెరువులను, క్వారీ గుంతలను పూడ్చి నిరుపేదలకు అమ్మి కోట్లు గడించారు. గాజుల రామారంలోని వందల ఎకరాల ప్రభుత్వ భూముల అన్యకాంతంపై అనేక ఫిర్యాదులు రావడంతో మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి ప్రత్యేక దృష్టి సారించి శనివారం సర్వే నెంబర్ 307 భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాం తంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయమే హైడ్రా పెద్ద ఎత్తున ఆపరేషన్ చేపట్ట డంతో స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఆదివారం తెల్లవారుజామున రంగ ప్రవేశం చేయడంతో స్థానికులు భయాందోళన గుర య్యారు. వందలాది ఇల్లు నేలమట్టం చేయడంతో బాలయ్యనగర్ బస్తి, గాలి పోచమ్మ బస్తీలోని కొన్ని కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

#### హైడ్రా వచ్చింది.. మా బతుకులు ఆగం చేసింది

కూలి నాలి చేసుకొని జీవనం కొనసాగిస్తున్న మా బతుకులను హైడ్రా వచ్చి ఆగం చేసిందని బాలయ్య నగర్ బస్తీలోని రోడ్డున పడ్డ మహిళలు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి సామాన్లతో పాటు తమ పిల్లలతో రోడ్లపై చేరి హైడ్రాపై బతుకమ్మ పాటలతో వినూత్న రీతిలో తమ నిరసన వ్యక్తం చేశారు.

#### కబ్జాల పాపం బిఆర్ఎస్ నాయకులదే : కూన శ్రీశైలంగౌడ్

ప్రభుత్వ స్థలాలను కబ్జాలకు పాల్పడమని ప్రేరేపించింది స్థానికంగా ఉన్న బిఆర్ఎస్ నాయకులేనని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూముల్లో వెలసిన నిర్మాణాలను హైడ్రా అధికారులు తొల గిస్తుండడంతో ఆయన సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. రోడ్డునపడ బాధితులను పరామర్శించారు. గాజులరామరం సర్వే నెంబర్ 307లో కూల్చి వేతలు చెయ్యాల్సిన ఆర్డర్ ఉండగా 342 సర్వే నెంబర్‌లో ఆన్నిషియల్ బయట ప్రపంచానికి తెలియకుండా మీడియాను బ్యాన్ చేసి కూల్చు తున్నారని, తమకు తెలంగాణ గౌరవ హై కోర్ట్ ఆర్డర్ ఉన్న లెక్క చేయకుండా తమపై దౌర్జన్యం చేస్తున్నారని ఆగ్రహించి హైడ్రా, పోలీస్, రెవిన్యూ కార్లపై రాళ్లురువ్వారు. ఈ దాడిలో దాదాపు నలుగురు అధికారులకు గాయపడ్డారు. జేసీబీలను ధ్వంసం చేశారు. ఇద్దరిని అదుపులో తీసుకున్నా రు. స్థానికంగా బస్తి లీడర్ అబిద్‌ను అరెస్ట్ చేసి జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషనుకు తరలించారు.

#### 275 ఎకరాలకుపైగా భూమిని స్వాధీనం : హైడ్రా కమిషనర్ రంగనాథ్

గాజులరామారంలో ప్రభుత్వ భూముల ఆక్రమ ణలు తొలగిస్తున్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసినవారిలో రాజకీయ నేతలు, ఉన్నతాధికారులు ఉన్నారని చెప్పారు. 40 ఎకరాల్లో పేదల నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. వాణిజ్య షెడ్లు, కాంపౌండ్ గోడలు, గదులు నిర్మించిన వాటిని తొలగిస్తాం. కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూమిని వెనక్కి తీసుకుని కంచె ఏర్పాటు చేస్తాం. రూ.13 వేల కోట్ల విలువైన 275 ఎకరాలకు పైగా భూమిని స్వాధీనం చేసుకుంటామని రంగనాథ్ తెలిపారు.

# నదీజలాల వాటా విషయంలో రాజీలేదు

### తెలంగాణ హక్కులను కాలరాసిన బిఆర్ఎస్

### ఆల్మట్టి ఎత్తును న్యాయపరంగా అడ్డుకుంటాం: మంత్రి ఉత్తమ్



**హుజూర్‌నగర్ (గరిడేపల్లి), సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** రాష్ట్రానికి చెందాల్సిన నదీ జలాల వాటాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని భారీ నీటిపారుదల శాఖ, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాల ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. హుజూర్‌నగర్‌లో మున్సిపల్ మాజీచైర్మన్ గెల్లి అర్చన రవి నివాసంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. పదేళ్ల కెసిఆర్ పాలనలో బిఆర్ఎస్ ప్రభుత్వం అవలం బించిన విధానాలతో నదీ జలాల విషయంలో రాష్ట్రానికి నష్టం జరిగిందని ఆరోపించారు. వారు చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు చేస్తున్న ప్రయత్నంలో భాగమే కాంగ్రెస్ ప్రభుత్వం పై అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర నది జలాల హక్కుల కోసం ఏ పోరాటానికైనా తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి ఎత్తు పెంచుతుందనే విషయంపై ఆధారాలు లేని ప్రచారాలను బి.ఆర్.ఎస్ నాయకులు భుజా నేసుకుని అర్థం లేని ఆరోపణలను చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఆల్మట్టి ఎత్తు పెంచే విషయంలో గతంలోనే సుప్రీంకోర్టులో కేసు ఉన్నదని, దాని ద్వారా బలమైన వాదనను వినిపించి న్యాయపోరాటం చేస్తామని ఆయన తెలిపారు. తెలంగాణ హక్కులను కాల రాసింది బి ఆర్ ఎస్ ప్రభుత్వమేనని కెసిఆర్ పాలనలోని జరగాల్సిన నష్టం జరిగిందని ఆయన ఆరోపించారు. నదీ జలాల వాటాల విషయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు 811 టీఎంసీ లను కేటాయిస్తే దానిలో తెలంగాణ రాష్ట్రానికి 299 టీఎంసీలు సరిపోతాయని మిగిలిన 512 టీఎంసీల ఆంధ్రప్రదేశ్ వాడుకునే విధంగా లిఖితపూర్వకంగా బిఆర్ఎస్ ఒప్పందం చేసుకున్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వైయస్ హయాంలో తలపెట్టిన తుమ్మిడిహట్టి, ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టులను పునః ప్రారం భిస్తామని ఆయన తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో నష్టం చేసిన వారిపై చట్టపరమైన చర్యలను కొనసాగిస్తూనే వాటిని పునరుద్ధరిం చేందుకు అవసరమైన చర్యలను చేపడుతున్నట్లు తెలిపారు. ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు మహాత్మా గాంధీ ముక్త్యాల బ్రాంచి కెనాల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుగా నామకరణం చేస్తున్నట్లు మంత్రి ఉత్తం ప్రకటించారు.

